# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 10-08-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1. ఆంధ్రప్రదేశ్ లో 2029 నాటికి పేదరికం లేని సమాజమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు.**

**2. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు జాతీయ థర్మల్ విద్యుత్తు సంస్థకు అన్ని విధాలా సహకరిస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు.**

**3. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గిరిజనుల సంక్షేమం కోసం 7వేల 557 కోట్ల రూపాయలను కేటాయించిందని గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు.**

**4. సోలార్ విద్యుత్ ను పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించిందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు.**

**5. గిరిజన ప్రాంతాల అభివృద్ధి, ఆదివాసీలకు జీవనోపాధికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వివిధ సంస్థలతో కీలకమైన 21 ఒప్పందాలను కుదుర్చుకుంది.**

==========================

ఆంధ్రప్రదేశ్ లో 2029 నాటికి పేదరికం లేని సమాజమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. పి-4 కార్యక్రమంలో ఇప్పటికే 15 లక్షల మంది దాతలు ముందుకు వచ్చారని తెలిపారు. నెల్లూరులోని భగత్ సింగ్ నగర్ కాలనీ వాసులకు ఇళ్ళ పట్టాల పంపిణీ కార్యక్రమంలో నిన్న ఉండవల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయం నుంచి ఆయన వర్చువల్ గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. 63 లక్షల మందికి 33 వేల కోట్ల రూపాయలను పింఛనుగా ఇస్తున్న ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వమన్నారు. త్వరలో ఆర్టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కలించనున్నట్లు చెప్పారు. కాగా.. పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి లబ్ధిదారులకు ఇళ్ళ పట్టాలు అందజేశారు.

--------------------------

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు జాతీయ థర్మల్ విద్యుత్తు సంస్థ – ఎన్టీపీసీకి అన్ని విధాలా సహకరిస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఎన్టీపీసీ సీఎండీ గురుదీప్ సింగ్ నేతృత్వంలో అధికారుల బృందం హైదరాబాదులో ముఖ్యమంత్రిని నిన్న మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో 80వేల కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టేందుకు ఎన్టీపీసీ సంసిద్ధత వ్యక్తం చేసింది. పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి రంగంలో పెట్టుబడులు పెట్టనున్నట్లు బృందం వివరించింది. సోలార్, పవన విద్యుత్ ప్రాజెక్టుల్లో పెట్టుబడులకు

సుముఖత వ్యక్తం చేసింది. 6 వేల 700 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ఉత్పత్తికి అవకాశం ఉందని ముఖ్యమంత్రికి ఎన్టీపీసీ బృందం వివరించింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గిరిజనుల సంక్షేమం కోసం 7వేల 557 కోట్ల రూపాయలను కేటాయించిందని గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. కృష్ణా జిల్లాలోని మచిలీపట్నం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిన్న ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గిరిజనుల కోసం కూటమి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తుందని తెలిపారు. సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ – ఐటిడిఎలను ఏర్పాటు చేసి గిరిజనులను ఆర్థికంగా, విద్యాపరంగా పురోగమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొంటూ..

వాయిస్.. 33 సెకన్లు

---------------------------

సోలార్ విద్యుత్ ను పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించిందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాదులోని సచివాలయం నుంచి ప్రభుత్వ భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్లు, ఇందిరా సౌర గిరిజన వికాసం పథకం అమలుపై జిల్లా కలెక్టర్లతో ఆయన నిన్న దృశ్యమాధ్యమ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇందిరా సౌర గిరిజన వికాసం పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, కలెక్టర్లు వారంలోగా ఇందుకు సంబంధించిన వివరాలు అందజేయాలని ఆదేశించారు.

---------------------------

వచ్చే విద్యా సంవత్సరం నాటికి నెల్లూరు నగరలోని 11 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను అన్ని హంగులతో తీర్చిదిద్దుతామని ఆంధ్రప్రదేశ్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పి.నారాయణ తెలిపారు. నెల్లూరు నగరంలోని మూలపేటలో బాలికల ఉన్నత పాఠశాల, వి.ఆర్. పాఠశాల, ఆర్ ఎస్ ఆర్ ఉన్నత పాఠశాలలను అధికారులతో కలిసి మంత్రి నారాయణ నిన్న పరిశీలించారు.. వి.ఆర్. ఉన్నత పాఠశాల తరహాలోనే మిగిలిన పాఠశాలలను పి – 4 కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి చేస్తామని పేర్కొంటూ...

వాయిస్... 20 సెకన్లు

---------------------------

గిరిజన ప్రాంతాల అభివృద్ధి, ఆదివాసీలకు జీవనోపాధి, వ్యవసాయం, అటవీ ఉత్పత్తుల మార్కెటింగ్, పర్యాటక రంగాన్ని ప్రోత్సహించటం వంటి అంశాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వివిధ సంస్థలతో కీలకమైన 21 ఒప్పందాలను కుదుర్చుకుంది. అల్లూరి సీతరామరాజు జిల్లా పాడేరు మండలంలోని అగిశపల్లిలో నిన్న జరిగిన అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగంలోని వివిధ సంస్థలు ఈ ఒప్పందాలను కుదుర్చుకున్నాయి.

అరకు కాఫీ మార్కెటింగ్ సహా వివిధ అటవీ, గిరిజన ఉత్పత్తులకు దేశీయంగా, విదేశాల్లో మార్కెటింగ్ కల్పించేలా ఈ అవగాహనా ఒప్పందాలు కుదిరాయి. రబ్బరు సాగు అభివృద్ధికి కేంద్రీయ రబ్బర్ బోర్డు ఐటీడీఏ తో ఒప్పందం కుదుర్చుకుంది. గిరిజన ఉత్పత్తుల విక్రయాలు, అరకు కాఫీకి ప్రోత్సాహం కల్పించేందుకుగానూ

జీసీసీతో ఒప్పందం కుదిరింది. ఇతర పలు సంస్థలతో వివిధ అంశాలకు సంబంధించి ఒప్పందాలు కుదుర్చుకున్నారు.

---------------------------

దేశవ్యాప్తంగా ఐక్యతా భావనను, దేశ భక్తిని పెంపొందించేందుకు "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమాన్ని స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రజలు తమ ఇళ్ళలో త్రివర్ణ పతాకాన్ని ఎగుర వేసి సంబంధిత సెల్ఫీలను www.harghartiranga.com వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేయడం, తిరంగా బైక్ ర్యాలీలు, విద్యార్థులకు తిరంగా రంగోలి, తిరంగా రాఖీ తయారీ వంటి కార్యక్రమాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్నాయి. ప్రతి భారతీయునిలో దేశ భక్తి భావనను పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

---------------------------

రాఖీ పండగ సందర్భంగా ఆర్టీసీ సిబ్బంది అద్భుతంగా పని చేశారని తెలంగాణ రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కొనియాడారు. హైదరాబాదులో నిన్న ఆయన మాట్లాడుతూ.. గతేడాది రాఖీ పండగ సందర్భంగా మూడు రోజుల్లో రికార్డు స్థాయిలో 1.77 కోట్ల మంది ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగించారన్నారు. ఈ ఏడాది అదే రీతిలో సిబ్బంది పని చేశారని మంత్రి పేర్కొన్నారు. సోదరభావానికి ప్రతీకైన రాఖీ పండగ రోజును త్యాగం చేసి.. నిబద్దత, అంకితభావం, క్రమశిక్షణతో విధులు నిర్వహించారని సిబ్బందిని ప్రశంసించారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా మహాలక్ష్మి పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు.

---------------------------

పశ్చిమ మధ్య వాయువ్య బంగాళాఖాతంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, దీని ప్రభావంతో ఈనెల 13వ తేదీ నాటికి బంగాళాఖాతంలో అల్పపడీనం ఏర్పడే అవకాశముందని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. దీంతో ఆంధ్రప్రదేశ్‌లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎమ్.వెంకట్రావ్ తెలియజేస్తూ....

వాయిస్...20 సెకన్లు

మరో వైపు తెలంగాణలో హైదరాబాదుతోపాటు పలు చోట్ల గత రాత్రి భారీ వర్షం కురిసింది. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై భారీగా వరద నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది.

=====================